క్లుప్తంగా

జగన్‌ను కలసిన నారాయణరెడ్డి



తాడేపల్లిలో జగన్‌ను కలసిన నారాయణరెడ్డి

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం ఆ పార్టీ నాయకుడు వడిశెట్టి నారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిసి నియోజకవర్గంలో పరిస్థితులను ఆయనకు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి: విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూట్ ఇంజినీర్ ప్రభాకర్ గురువారం తెలిపారు. మండలంలోని వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి, రవీంద్రపురం, సుబ్బంపేట, ఉప్పాడ, అమినాబాద్, మూలపేట గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజీనామా



ఆవాల రాజేశ్వరి

సామర్లకోట: రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి తన పదవికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు బీసీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి రాజీనామా లేఖను పంపిన్నట్టు ఆమె విలేకరులకు తెలిపారు. తనను పదవిలో నియమించిన జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఓటమి చెందడంతో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన దవులూరి దొరబాబుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పటికీ వైఎస్సార్ సీపీలోనే ఉంటానని ఆమె పేర్కొన్నారు.

సొసైటీ అధ్యక్ష పదవికి రాజీనామా

సామర్లకోట: నామినేటెడ్ పోస్టుగా నియమించబడిన సామర్లకోట పీఏసీఎస్ అధ్యక్ష పదవికి మేకా శ్రీనివాసరావు గురువారం రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా లభించిన పదవి, ఆ పార్టీ ఓటమి చెందడంతో రాజీనామా చేసిన్నట్టు ఆయన తెలిపారు. తన రాజీనామాను సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్‌కు అందజేసినట్టు తెలిపారు.

బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయడంలో ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని పలు పాఠశాలలను ఆయన పరిశీలించి, పవర గ్రామంలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పాఠశాలలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంటు పరిశుభ్రంగా ఉండాలని, నాణ్యమైన బోధన ద్వారా మరి కొంతమంది విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉంటుందన్నారు.

విశ్రాంత ఎంఈఓ మృతి



వాణీకుమారి (ఫైల్)

సామర్లకోట: మండల విద్యాశాఖాధికారిగా పని చేసి పదవీ విరమణ చేసిన వాణీకుమారి గురువారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఇంటి వద్ద మృతి చెందారు. ఆమె మృతికి ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీ సిబ్బంది, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

ప్రపంచ కుట్టుయంత్ర దినోత్సవం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని అడబాల ట్రస్ట్ కార్యాలయంలో గురువారం ప్రపంచ కుట్టు యంత్రాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ద్వారా కుట్టు శిక్షణ ఇస్తున్న శ్రీలక్ష్మిని ట్రస్ట్ నిర్వాహకుడు అడబాల రత్నప్రసాద్ సన్మానించారు. అనంతరం లాటరీ ద్వారా ఇద్దరికి కుటు మెషీన్లను అందజేశారు.

ఇంటర్ విద్య.. మరింత చేరువ

- ప్రతి మండలానికి రెండు కళాశాలలు
- జెడ్పీ హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేసి వాటిలో ఇంటర్ తరగతులు ప్రారంభం
- గ్రామీణ విద్యార్థులకు చేరువైన ఇంటర్ విద్య



చేబ్రోలులో ఇంటింటికీ వెళ్లి అడ్మిషన్లు చేయిస్తున్న అధ్యాపకులు

గొల్లప్రోలు: గ్రామాల్లోని పేద విద్యార్థులకు ఉన్నత విద్యను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. గత ప్రభుత్వం మండలంలోని రెండు జెడ్పీ హైస్కూళ్లను ఇంటర్మీడియెట్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. ప్రతి మండలంలో రెండు జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసి ఇంటర్మీడియెట్ విద్య కోసం సదూర ప్రాంతాలకు వెళ్లే గ్రామీణ విద్యార్థుల కష్టాలకు చెక్ పెట్టింది. దీంతో పేద విద్యార్థులు, బాలికలు సొంతూరులోనే ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు.

బాలికలకు ప్రత్యేకంగా...

నియోజకవర్గంలోని ప్రతి మండలంలో రెండు పాఠశాలలను ఎంపిక చేసి వాటిని ఇంటర్ వరకూ అప్‌గ్రేడ్ చేశారు. వాటిలో ఒక దానిని ప్రత్యేకంగా బాలికలకు కేటాయించారు. దీంతో బాలికలను ఉన్నత విద్యావంతులుగా చేయ్యాలన్నది ప్రభుత్వ లక్ష్యం. రెండో కళాశాలలో కో ఎడ్యుకేషన్ ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేశారు. ఇక్కడ రెండేళ్ల క్రితమే బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారు. గొల్లప్రోలు పట్టణంలో ముందే కో ఎడ్యుకేషన్‌ను ప్రారంభించారు.

అందుబాటులో రెండు గ్రూపులు

ఆయా కళాశాలల్లో ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ గ్రూపులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపును తీసుకుని విద్యను అభ్యసిస్తున్నారు. ఒక్కో గ్రూపులో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన చేస్తుండటం విద్యార్థులకు కలసొచ్చే అంశం. ఒక్కో పాఠశాలలో 80 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇంటర్ విద్య చేరువైంది. ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేస్తున్న కళాశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులను చేర్పించేందుకు అధ్యాపకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు.

జిల్లాలో 14 ఏర్పాటు

గత ప్రభుత్వ నిర్ణయం మేరకు రెండేళ్ల క్రితం జిల్లాలోని 14 జెడ్పీ హైస్కూళ్లలో ఇంటర్మీడియెట్‌ను ప్రారంభించారు. ఈ ఏడాది మరో 9 పాఠశాలలను ఎంపిక చేశారు.



చేబ్రోలు జూనియర్ కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పిఠాపురం నియోజకవర్గంలో అప్‌గ్రేడ్ చేసిన పాఠశాలలు

గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు హైస్కూల్, గొల్లప్రోలు పట్టణంలోని జెడ్పీ హైస్కూల్, కొత్తపల్లి మండలంలో మూలపేట జెడ్పీ హైస్కూల్, కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్, పిఠాపురం మండలంలో చంద్రమాంపల్లి జెడ్పీ హైస్కూళ్లలో ఇంటర్మీడియెట్‌ను ప్రారంభించారు.

జోరుగా అడ్మిషన్లు



చేబ్రోలు ఇంటర్ కళాశాలలో ఈ ఏడాది ఇప్పటి వరకూ 22 మంది అడ్మిషన్లు పొందారు. వీరిలో 10 మంది ఎంపీసీ, 12 మంది బైపీసీ గ్రూపులు తీసుకున్నారు. ఇంకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యా బోధన చేయడమే కాకండా ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తాం.

సీహెచ్‌వీ ప్రకాష్, ప్రిన్సిపాల్, చేబ్రోలు కళాశాల

బడి మెట్లెక్కిన బాలలు



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు వస్తున్న విద్యార్థులు

సామర్లకోట: రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరయ్యారు. వేసవి సెలవుల అనంతరం తెరుచుకున్న పాఠశాలలకు యూనిఫాంతో విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాలలు తెరచి మొదటి రోజు కావడంతో బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 60 శాతం, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో 60 శాతం, బీబీఆర్ హైస్కూల్‌లో 40 శాతం, తోట గోపాలకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో 30 శాతం విద్యార్థులు హాజరైనట్టు ఆయా పాఠశాలల హెచ్ఎంలు తోటకూర సాయిరామకృష్ణ, యు.సత్యనారాయణ లలితా మాణిక్యాంబ, తాండ్ర శ్యామ్‌సుందర్ తెలిపారు. అలాగే ప్రభుత్వ హైస్కూల్‌లో 50 శాతం, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 40 శాతం విద్యార్థులు హాజరు అయ్యారని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య తెలిపారు. అదే విధంగా మండల పరిధిలో హాజరు శాతం మరింత తక్కువగా ఉన్నదని ఎంఈఓ తెలిపారు. సోమవారం నుంచి హాజరు శాతం పెరుగుతుందని చెప్పారు.

కాపు కల్యాణ మండపాన్ని శుభ్రం చేయండి

సామర్లకోట: ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాల మేరకు కాపు కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకువచ్చే చర్యలు తీసుకుంటున్నట్టు మునిసిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. గురువారం సాయంత్రం కాపు నాయకులు, టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో కాపు కల్యాణ మండపాన్ని పరిశీలించారు. కల్యాణ మండపం కిటికీలు, గుమ్మాలు చోరీకి గురి కావడంతో వెంటనే కల్యాణ మండపం ప్రధాన గేటు ఏర్పాటు చేయాలని కాపు సంఘ నాయకులు డిమాండ్ చేశారు. వెంటనే శుభ్రం చేయించాలని కౌన్సిలర్ బలుసు వాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం నుంచి కాపు కల్యాణ మండపంలో పనులు ప్రారంభిస్తామని కమిషనర్ రామారావు చెప్పారు. అలాగే నాగార్జున ఫిల్టరు చెరువులో పూడిక తీయించాలని నాగార్జున యాజమాన్యం, పబ్లిక్ హెల్త్ అధికారులకు లిఖిత పూర్వకంగా లేఖ రాస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.



సామర్లకోటలోని కాపు కల్యాణ మండపాన్ని పరిశీలించిన నాయకులు

అధికారుల తీరుపై గరంగరం

- రైతుల సమస్యలను పట్టించుకోకపోవడంపై జెడ్పీటీసీ ఆగ్రహం
- వాడీవేడిగా మండల సమావేశం

గొల్లప్రోలు: అధికారులు తీరుపై గొల్లప్రోలు జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ విజయప్రకాశరావు సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టపోయిన జాబితాను రైతు భరోసా కేంద్రల్లో అందుబాటులో ఉంచాలన్నారు. పంట నష్టం తమ బ్యాంకు ఖాతాలకు జమకాని రైతులు ఆర్‌బీకేల చుట్టూ తిరుగుతున్నారని, అధికారులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతుల జాబితాలో 500 మంది బ్యాంక్ ఖాతాల్లో లోపాలు ఉండటంతో ఆ పేర్లు తిరిగి వచ్చాయన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు సక్రమంగా లేని రైతులకు సమాచారం ఇచ్చి వారి నుంచి పూర్తి వివరాలు సేకరించి రెండు రోజుల్లో తిరిగి పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగ లోవరాజు

నీటి వనరుల సంరక్షణ అందరి బాధ్యత



జల వనరులపై అవగాహన ర్యాలీ

సామర్లకోట: నీటి వనరులను సంరక్షించవలసిన బాధ్యత అందరిపై ఉంటుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎకో క్లబ్ కార్యక్రమంలో భాగంగా జల వనరులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి పొదుపు, లీకేజీలను అరికట్టడం వల్ల ఉపయోగాలను సాయిరామకృష్ణ వివరించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కలిగించే విధంగా పట్టణ పుర వీధుల గుండా ఉపాధ్యాయులు, విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎకో క్లబ్ కన్వీనర్ ఏఎల్‌వీ కుమారి, కో కన్వీనర్ కె.శ్రీనివాసు, ఫిజికల్ డైరెక్టర్ తాళ్లూరి వైకుంతం, ఉపాధ్యాయులు వి.రాజు, జి.రాజు కేవీవీ సత్య నారాయణ, సీహెచ్ భద్ర, లక్ష్మీదుర్గ, శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ రామారావు

సామర్లకోట: బ్యాంకుల నుంచి మహిళా సంఘాలకు ఇస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకునేలా మెప్మా సిబ్బంది పని చేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. గురువారం స్థానిక మెప్మా కార్యాలయంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత అధ్యక్షతన యూనియన్ బ్యాంకు అధికారులు మెప్మా సిబ్బందితో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళా సంఘాల సభ్యులే కాకుండా ఇతర మహిళలు వ్యాపారాలు చేసుకొవడానికి ముందుకు వస్తే బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అలాగే ఏడాదికి రూ.20 చెల్లిస్తే లభించే బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయ డిప్యూటీ రీజయన్ హెడ్ జీఎల్‌వీఎస్ఎఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మహిళలకు యూనియన్ బ్యాంకు వివిధ రకాల రుణ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. వాటిని వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజరు ఎం.కృష్ణమోహన్, సిబ్బంది, మెప్మా సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

మానవ సేవే మాధవ సేవ



చీరలు పంపిణీ చేస్తున్న ఉమర్ ఆలీషా

డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: మానవ సేవే.. మాధవ సేవ అని శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. స్థానిక పీఠం ఆవరణలో గురువారం సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎవరికి తోచిన విధంగా వారు ఇతరులకు సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడేనికి చెందిన కిడ్నెస్ సొసైటీ అధ్యక్షుడు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా లయన్స్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, సరోజిని దంపతుల సౌజన్యంతో వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న 153 మంది మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు, కిడ్నెస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.విశ్వసరావు, కనకదుర్గ వల్లి, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- అధికార యంత్రాంగం సహకరించాలి
- ఎమ్మెల్యే చిన రాజప్ప

పెద్దాపురం: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేసేందుకు తాను సిద్ధమని, దీనికి అధికార యంత్రాంగం సహకారం ఎంతో అవసరమని నియోజకవర్గ ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయిలో ఆయా శాఖల అధికారులతో ఆర్డీఓ జేఎస్ రామారావు అధ్యక్షతన సమీక్షించారు. ఈ సందర్భంగా రాజప్ప మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా శతాబ్ది పార్కు అభివృద్ధితో పాటు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, గుర్రాల సెంటర్‌లో ఉన్న రింగ్ సెంటర్ అభివృద్ధిపై దృష్టి సారించాలని కమిషనర్ కేవీ పద్మావతిని ఆదేశించారు. సామర్లకోటలో నీలమ్మ చెరువు గట్టు, పార్కు అభివృద్ధి, పారిశుధ్య పనులు మరింత అభివృద్ధి చేయాలని కమిషనర్ రామారావును ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ, ఎంపీడీఓ ఉషారాణి, సీడీపీఓ ఉష, డీఈ ఆదినారాయణ, తహసీల్దార్లు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్ రామారావు

సామర్లకోట: ఎమ్మెల్యేగా విజయం సాధించిన నిమ్మకాయల చినరాజప్పను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు గురువారం మర్యాద పూర్వకంగా కలిసారు. రాష్ట్ర మంత్రివర్గం ప్రమాణ స్వీకారానికి హాజరై గురువారం వచ్చిన రాజప్పను అచ్చంపేటలోని ఆయన స్వగృహంలో కలిసి అభినందించారు.



పెద్దాపురంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

వృద్ధులకు దుస్తుల పంపిణీ



నడకుదురు జవావళి వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ చేస్తున్న విజయరాజు

కరప: మండలం నడకుదురులోని జనావళి వృద్ధాశ్రమంలోని 15 మంది వృద్ధులకు కాకినాడ దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు అన్నదానం చేసి, దుస్తులు, నగదును అందజేశారు. ఆశ్రమ నిర్వాహకుడు మందపల్లి శ్యామ్‌ను విజయరాజు అభినందించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, ఈఓలు కె.తిరుమల రవితేజ, సీహెచ్ వెంకటరమణమూర్తి, వద్దాది సత్తిబాబు, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం



సూర్యారావుపేటలో రోడ్డుపై కూలిన భారీ వృక్షం

గంటపాటు నిలిచిన ట్రాఫిక్

బోట్‌క్లబ్: తేలికపాటి గాలులకే స్థానిక సూర్యారావుపేటలోని వివేకానంద పార్కు ఎదురుగా ఉన్న చెట్టు గురువారం సాయంత్రం రోడ్డుపై కూలింది. సుమారు గంటపాటు అటుగా వెళ్లాల్సిన బాటసారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ట్రాఫిక్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది స్పందించి చెట్టుకొమ్మలు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు.

వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: వివాహిత ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు స్థానిక పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని అమరవల్లి గ్రామానికి చెందిన బోరా కనకదుర్గ (38) అదే గ్రామానికి చెందిన బోరా చిన రమణారెడ్డితో గత కొంత కాలంగా అక్రమ సంబంధం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కనకదుర్గను రమణారెడ్డి వేధింపులకు గురి చేసేవాడు. వేధింపులు తట్టుకోలేక గత నెల 21న కనకదుర్గ ఉప్పుటేరులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త బోరా రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆమె ఆత్మహత్యకు కారణమైన బోరా చిన రమణారెడ్డిని అరెస్ట్ చేసి పిఠాపురం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

పాలు కల్తీ చేస్తే కేసు

- ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సుబ్బారావు
- సర్పవరంలో పలుదుకాణాల్లో తనిఖీ



కాకినాడ రూరల్: పాలు కల్తీ చేస్తే చట్టపరంగా కేసులు పెడతామని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సుబ్బారావు వెల్లడించారు. స్థానిక సర్పవరం గ్రామంలో శ్రీ అన్నపూర్ణ మిల్క్ సప్లయ్ దుకాణంలో పాలు కల్తీ చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం తనిఖీ చేశారు. పాలలో వెన్న శాతం వచ్చే మెషీన్‌లో పరిశీలించి, ఆవు పాలు, గేదె పాలను పరీక్షించి, లేబొరేటరీకి పంపించారు. అనంతరం అపరిశుభ్రంగా ఉన్న సప్లై కేంద్రాన్ని, పాలల్లో పడిన ఈగలను అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా సేఫ్టీ ఆఫీసర్ సుబ్బారావు మాట్లాడుతూ వినియోగదారులు పాలు కోనేటప్పుడు వాటి రంగు, రుచి గుర్తించాలని అలాగే పాలలో కల్తీ చేసినట్టు అనుమానం వచ్చిన వెంటనే నాగమల్లి తోట జంక్షన్‌లోని పైడా వారి వీధిలో ఉన్న ఫుడ్ అండ్ సేఫ్టీ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఇప్పుడు తనిఖీ చేసిన పాలను ల్యాబ్‌లో టెస్టుకు పంపించామని, రిపోర్ట్స్‌లో కల్తీకి పాల్పడినట్లు వస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు.